క్లుప్తంగా

తురగా సూర్యారావుకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సూర్యారావు

బోట్‌క్లబ్‌: కాకినాడకు చెందిన కవి, నటుడు తురగా సూర్యారావుకు అక్షర తేజం జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ఏలూరులో సోమవారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ప్రతిభా పురస్కార ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని కళావేదిక చైర్మన్‌ కత్తిమండ ప్రతాప్‌కుమార్‌ నుంచి అందుకున్నారు. కళలకు, సాహిత్యానికి ఆయన చేస్తున్న సేవలకు ఈ అవార్డు లభించడం ఆనందంగా ఉందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

చలివేంద్రాలు ఎంతో ప్రయోజనకరం

బోట్‌క్లబ్‌: రోజురోజుకూ పెరుగుతున్న వేడిగాడ్పుల కారణంగా బాటసారులకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని సానా సతీష్‌బాబు ఫౌండేషన్‌ చైర్మన్‌ తలాటం హరీష్‌ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సోమవారం నాన్‌స్టాప్‌ కౌంటర్‌ వద్ద ఫౌండేషన్‌ సభ్యులు ముమ్మిడి విశ్వనాథం సౌజన్యంతో రెండు వేల మందికి మజ్జిగ, గ్లూకోజ్‌, చెరుకు రసం అందించారు. వర్షాకాలం వచ్చే వరకూ ఈ చలివేంద్రం కొనసాగుతుందని చెప్పారు.

ఘనంగా ప్లేస్‌మెంట్‌ డే వేడుకలు



విద్యార్థులను సత్కరిస్తున్న సత్యశ్రీరామ్‌

బాలాజీచెరువు: పైడా కళాశాలలో ప్లేస్‌మెంట్‌ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్‌ పైడా సత్యప్రసాద్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కార్యదర్శి సత్యశ్రీరామ్‌, సంయుక్త కార్యదర్శి నిత్య శ్రీరామ్‌ సత్కరించారు. ఈ ఏడాది క్యాంపస్‌ ఇంటర్వ్యూల్లో 565 మంది విద్యార్థులు ఐబీఎం, ఇన్ఫోసిస్‌, టీసీఎస్‌ లాంటి సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని సత్యశ్రీరామ్‌ చెప్పారు. గత మూడేళ్లలో కళాశాల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. నాక్‌, అటానమస్‌ వంటి స్థాయికి ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్‌ వీరభద్రరావు, డీడీ రవీంద్రరెడ్డి, ప్రిన్సిపాల్‌ సూర్యప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్యాచరణ రూపొందించాలి

కలెక్టర్‌ షణ్మోహన్‌



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్‌

కాకినాడ సిటీ: స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా శాఖల వారీగా జిల్లా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్‌ షణ్మోహన్‌ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన కార్పొరేషన్‌ కమిషనర్‌ భావన, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావుతో కలిసి జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను నిర్దేశించారు. శాఖల వారీగా నియోజకవర్గ, మండల స్థాయి పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను అధ్యయనం చేయాలన్నారు. వచ్చే ఏడాది ఏ రంగంలో ఏ మేరకు అభివృద్ధి ఉంటుందనే అంశంపై దృష్టి పెట్టి ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి ఎ.రవీంద్రనాథ్‌రెడ్డి, సీపీవో పి.త్రినాథ్‌, పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్‌: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్‌–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులు నమోదయ్యాయి. సోమవారం 26 మంది నిందితులను కోర్టులో హాజరు పరిచారు. ఏడుగురికి రెండు రోజుల చొప్పున జైలు, 19 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సినిమాలు

ఆనంద్‌ సినిమాస్‌	: శుభం, జింఖానా, కలియుగం 2064, హిట్‌ ది థర్డ్‌ కేస్‌
దేవీ మల్టీప్లెక్స్‌	: సింగిల్‌, 6 జర్నీ, సీఎం పెళ్లాం, మహాబలి, తుడరం
లక్ష్మి	: హిట్‌ ది థర్డ్‌ కేస్‌
సత్యగౌరి	: సింగిల్‌
తిరుమల	: శుభం
సీఅండ్‌సీ	: రెట్రో
సీఅండ్‌సీ–2	: హిట్‌ ది థర్డ్‌ కేస్‌
శ్రీప్రియ	: జగదేకవీరుడు అతిలోక సుందరి
పద్మప్రియ	: సింగిల్‌

సేవా ప్రదాతలు

- చిరు ఆదాయం.. విశాల హృదయం
- సేవాభావంతో చలివేంద్రాలు నిర్వహిస్తున్న దాతలు
- మండుటెండలో తీరుతున్న దాహార్తి
- ప్రయాణికులకు చల్లని నీరు, మజ్జిగ పంపిణీ

ఎంగిలి చేత్తో కాకిని తోలని జనాలున్న రోజులివి. అలాంటిది.. చిరు ఆదాయంతోనే బతుకీడుస్తున్నా.. సమాజానికి సేవ చేయాలన్న సత్సంకల్పంతో.. గొంతెండుతున్న వారి దాహార్తిని తీరుస్తున్న దాతలు వీరు. సేవే పరమావధిగా.. తమకొచ్చే కొద్దిపాటి ఆదాయంలో కూడా కొంత భాగాన్ని సమాజానికి కేటాయిస్తూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కాకినాడ రూరల్‌: వేసవి వచ్చిందంటే పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారు. ఉదయం నుంచే భానుడు నిప్పులు కక్కుతూ వస్తుంటే, ఎండ తీవ్రతకు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు సాహసించలేదని పరిస్థితి నెలకొంటుంది. ఈ వేసవిలో అకాల వర్షాల కారణంగా ఇప్పటి వరకు పెద్దగా ఎండ తీవ్రత తెలియని ప్రజానీకానికి మూడు రోజులుగా వడగాడ్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోత తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సోమవారం కాకినాడ రూరల్‌లో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్‌ ఉష్ణోగ్రత నమోదైంది. అగ్నికార్తె ప్రారంభం నుంచే నిప్పులు కక్కడం.. ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె రానుండడంతో ఎండలు తీవ్రత ఇంకా పెరగవచ్చని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఎండలు ఎలా ఉన్నా.. తమ బతుకు బండిని లాగేందుకు నిత్యం రహదారులపై రాకపోకలు సాగించే సామాన్య, మధ్యతరగతి ప్రజలు వడదెబ్బకు గురికాకుండా కాకినాడ నగరం, కాకినాడ రూరల్‌ ప్రాంతాల్లో దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ఆదుకుంటున్నాయి. ఎండలో ప్రయాణాలు సాగించే ద్విచక్ర వాహనదారులు, ఆటోలపై రాకపోకలు సాగించేవారు చలివేంద్రాల్లో గుక్కెడు చల్లని నీరు తాగి దాహార్తిని తీర్చుకుంటున్నారు. కాకినాడ రూరల్‌లో పలుచోట్ల చల్లని మజ్జిగను చలివేంద్రాల్లో ఏర్పాటు చేయడం విశేషం. బోట్‌క్లబ్‌ వద్ద ఉమర్‌ ఆలీషా రూరల్‌ డెవలప్‌మెంట్‌ ఆధ్వర్యంలో మనుషులతో పాటు, పశుపక్ష్యాదులకు చలివేంద్రాలు నెలకొల్పారు.

పాతికేళ్లుగా..

కాకినాడకు చెందిన అనపాల ఆంజనేయులురెడ్డి అవివాహితుడు. రోడ్డు పక్కన చిన్న ప్లాస్టిక్‌ సామాన్లు అమ్ముకునే అతడు తన సంపాదనలో సింహ భాగం సేవా కార్యక్రమాలకే ఖర్చు చేస్తున్నారు. కాకినాడ, రూరల్‌ ప్రాంతంలో ఆయన చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. కాకినాడ–పిఠాపురం రోడ్డులోని భవాని కాస్టింగ్‌ వద్ద రోడ్డు పక్కన ఏడాది పొడవునా ఆయన చలివేంద్రం నిర్వహిస్తున్నారు.

దాతృత్వంలో ఏపీఎస్పీ సిబ్బంది

ఏటా వేసవి వచ్చిందంటే రమణయ్యపేట ఏపీఎస్పీ బెటాలియన్‌ వద్ద పిఠాపురం రోడ్డును ఆనుకుని చలివేంద్రం దర్శనమిస్తుంది. బెటాలియన్‌ సిబ్బంది సొంతంగా సొమ్ము సమకూర్చుకుని వేసవిలో మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నారు. పిఠాపురం మార్గంలో రాకపోకలు సాగించే వారితో పాటు, స్థానికులు భారీగా దాహార్తి తీర్చుకుంటున్నారు.



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ ఎదురుగా పిఠాపురంలో రోడ్డులో చలివేంద్రం నిర్వహిస్తున్న ఆంజనేయరెడ్డి



ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌ వద్ద మజ్జిగ పంపిణీ

చిరు ఆదాయంతో..



రమణ్యపేట ఏపీఐఐసీ కాలనీలో చలివేంద్రం వద్ద సాయిరాం, మీనాక్షి దంపతులు

రమణయ్యపేటలో ఏపీఐఐసీ కాలనీ వద్ద ప్రతి రోజూ, ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రతి మంగళ, శనివారాలు, తిమ్మాపురం సాయిబాబా ఆలయం వద్ద ప్రతి గురువారం చలివేంద్రం ద్వారా చల్లని మజ్జిగ, తాగునీటిని అందించి దాహార్తిని తీరుస్తున్నారు పోలికొండ రాంబాబు(సాయిరాం), మీనాక్షి దంపతులు. ప్రైవేట్‌గా సెక్యూరిటీ గార్డుగా సాయిరామ్‌, హోమ్‌ గార్డుగా మీనాక్షి పని చేస్తూ, జీతం సొమ్ములో చెరో రూ.వెయ్యి చొప్పున నెలకు రూ.రెండు వేలు పొదుపు చేసి, వేసవిలో మూడు నెలల పాటు చలివేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సుమారు రూ.80 వేలు ఖర్చవుతుండగా, మిగిలిన సొమ్మును దాతలు సమకూరుస్తున్నట్టు వారు చెబుతున్నారు.

13 ఏళ్లుగా నిర్వహణ



వేసవిలో ప్రయాణాలు సాగించే వారు దాహార్తిని తీర్చేందుకు 13 ఏళ్లుగా చలివేంద్రం నిర్వహిస్తున్నాం. ఇందుకు నా భార్య ప్రోత్సాహం ఎక్కువ. ఇద్దరు పొదుపు సొమ్ము ఇందుకు ఖర్చు చేస్తున్నాం. నా భార్య హోమ్‌ గార్డుగా పనిచేస్తూ, చలివేంద్రం నిర్వహణకు ముందుకు వచ్చింది. ఏటా మూడు నెలల పాటు మజ్జిగ సరఫరా చేయగలుగుతున్నాం.

– పోలికొండ రాంబాబు(సాయిరాం)

సిబ్బంది సహకారంతో..



ఏటా సిబ్బంది సహకారంతో చలివేంద్రం నిర్వహిస్తున్నాం. ఇటీవల కమాండెంట్‌ నాగేంద్ర రావు చలివేంద్రం ప్రారంభించారు. పిఠాపురం–కాకినాడ రోడ్డులో ప్రయాణాలు సాగించే వారు ఎక్కువగా దీనిని వినియోగించుకుంటున్నారు.

– రాయుడు చినఅప్పలరాజు, హెచ్‌సీ–ఏపీఎస్పీ, రమణయ్యపేట

సంపాదనంతా సేవకే..



నేను పెళ్లి చేసుకోలేదు. బతుకు తెరువు కోసం రోడ్డు పక్కన ప్లాస్టిక్‌ సామగ్రి అమ్ముతుంటాను. వచ్చిన సొమ్ము సేవకే ఖర్చు చేస్తున్నాను. ఏడాది పొడవునా చలివేంద్రం ద్వారా ప్రయాణికుల దాహార్తి తీరుస్తున్నాను.

– అనపాల ఆంజనేయరెడ్డి, కాకినాడ

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరవు

వైఎస్సార్‌ సీపీ బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు అల్లి రాజబాబు



బోట్‌క్లబ్‌ (కాకినాడ సిటీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భద్రత కరవైందని వైఎస్సార్‌ సీపీ బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు అల్లి రాజబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యం రాష్ట్రంలో ఏదోక చోట మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ మహిళలపై అవమానాలు, అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు మాయమయ్యారని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌.. పిఠాపురంలో దళిత బాలికపై లైంగిక దాడి జరిగినా కనీసం పలకరించలేదని విమర్శించారు. దళిత ఎస్సీ ఎంపీటీసీని తెల్లవారుజాము మూడు గంటల ప్రాంతంలో ఉగ్రవాదిని బంధించినట్టు కనీసం దుస్తులు కూడా మార్చుకునే అవకాశమివ్వకుండా అరెస్ట్‌ చేశారన్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు.. మహిళలంటే ఎంత గౌరవం ఉందో అవగతమవుతుందన్నారు. మాజీ మంత్రి విడదల రజనిపై అక్కడి సీఐ వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్‌ రాజ్యాంగం అమలవుతుందని చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనమన్నారు.

గొప్ప అవకాశం కల్పించే ఓటమి



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్‌ వెంకటరమణ

బోట్‌క్లబ్‌ (కాకినాడసిటీ): ఓటమి తెచ్చే నిరాశలో గొప్ప అవకాశం దాగి ఉంటుందని సత్య చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌, ప్రముఖ రేడియాలజిస్ట్‌ డాక్టర్‌ కాద వెంకటరమణ అన్నారు. సత్య స్కాన్స్‌, డయాగ్నోస్టిక్స్‌, ట్రస్ట్‌ సంయుక్తాధ్వర్యంలో సోమవారం స్థానిక దంటు కళా క్షేత్రంలో పదో తరగతి విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విద్యలో నాణ్యత, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించి, యువత భవిష్యత్తును తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఏటా తమ సంస్థల తరఫున ఉపకార వేతనాలను అందిస్తున్నామన్నారు. కాకినాడ సీ పోర్ట్‌ చీఫ్‌ ఆపరేటింగ్‌ ఆఫీసర్‌ మురళీధర్‌ మాట్లాడుతూ, సానుకూల దృక్పథం, నిబద్ధత ఉంటే విజయాలు వాటంతట అవే వస్తాయనడానికి తన జీవితమే ఉదాహరణ అని చెప్పారు. ఆలోచనలు వికసించి, ఆచరణకు పురికొల్పే అర్థవంతమైన శీల నిర్మాణ సాధనే గౌతమ బుద్ధుడు బోధించిన అష్టాంగ మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్ర కమర్షియల్‌ ట్యాక్స్‌ రిటైర్డ్‌ అడిషనల్‌ కమిషనర్‌ వై.సత్యనారాయణ మాట్లాడుతూ, జీవితంలో నిజమైన సంతోషం పొందడానికి మన ఆలోచన విధానం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసించి, పదో తరగతి పరీక్షల్లో 540 మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన రాత పరీక్షలో ప్రతిభ చూపిన 70 మందికి రూ.3 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్‌ హెల్త్‌ వర్సిటీ మాజీ వీసీ డాక్టర్‌ వై.బాబ్జీ, డాక్టర్‌ ఆర్‌ఎస్‌బీ చక్రపాణి, డాక్టర్‌ రామ్‌ స్వరూప్‌ జవహర్‌, సామాజిక కార్యకర్త అల్లూరి సురేంద్ర, పడాల చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ సూర్యప్రసాద్‌, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.సుబ్బరాజు పాల్గొన్నారు.

సాగర తీరాన ఆధ్యాత్మిక సందడి

భావనారాయణ స్వామికి సముద్ర జలాలతో చక్రస్నానం



సూర్యారావుపేట వద్ద సాగర తీరాన భావనారాయణ స్వామికి చేస్తున్న చక్రస్నానం



బీచ్‌లో స్నానాలకు బారులు తీరిన భక్తులు

కాకినాడ రూరల్‌: కాకినాడ సాగర తీరాన సోమవారం ఉదయం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఐదు రోజుల క్రితం సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామివారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగిన విషయం విదితమే. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సర్పవరం ఆలయం నుంచి స్వామివారిని ఊరేగింపుగా సూర్యారావుపేట బీచ్‌కు తీసుకువచ్చారు. బీచ్‌లో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి చక్రస్నానం చేయించారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన సర్పవరం గ్రామస్తులు, భక్తులు స్నానాలాచరించారు. ఆలయ అర్చకులతో పాటు, ఈఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎట్టకేలకు పీఆర్‌ ప్రిన్సిపాల్‌ రిలీవ్‌

బాలాజీచెరువు: పలు వివాదాల్లో నిలిచిన పీఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ తిరుపాణ్యం ఎట్టకేలకు బాధ్యతల నుంచి సోమవారం రిలీవ్‌ అయ్యారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలకు ఆయనను బదిలీ చేస్తూ కళాశాల విద్య డైరెక్టరేట్‌ గత బుధవారం ఉత్తర్వులు జారీ చేయడంతో, ఇక్కడి బాధ్యతల నుంచి వైదొలిగారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కళాశాలలో విద్యార్థులు లేక అధ్యాపకులతో తరచూ వివాదాలతో వార్తల్లోకి ఎక్కారు. ముఖ్యంగా కమిషనర్‌ స్థాయి అధికారులతో నిర్లక్ష్యంగా ఉండటంతో పాటు, చరిత్ర కలిగిన కళాశాల న్యాక్‌ ర్యాంకు తగ్గడంలో ఆయన వైఖరి ప్రస్ఫుటమైంది. అంతేగాక కళాశాల నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలూ వెలువడ్డాయి. ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయనను బదిలీ చేశారు. ఆయనను 2023లో చోడవరం కళాశాలకు బదిలీ చేయగా, కోర్టును ఆశ్రయించి తిరిగి ఇదే కళాశాలకు పోస్టింగ్‌ ఉత్తర్వులు తెచ్చుకుని కొనసాగారు. మరలా ఇదే తరహాలో వ్యవహరిస్తారా లేక బదిలీపై వెళ్తారా అన్న సందేహాలకు ప్రస్తుతం ఫుల్‌స్టాప్‌ పడింది. వైస్‌ ప్రిన్సిపాల్‌ ఆంజనేయులుకు బుధవారం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించనున్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు శ్యామ్‌బాబు

కాకినాడ సిటీ: మాదిగ సామాజిక వర్గ అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప నాయకుడు కొండేపూడి శ్యామ్‌బాబు మాదిగ అని ఎమ్మార్పీఎస్‌, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ముమ్మడివరపు చిన సుబ్బారావు మాదిగ అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మార్పీఎస్‌ మాజీ అధ్యక్షులుగా పనిచేసిన కొండేపూడి శ్యామ్‌బాబు మాదిగ ఇటీవల మరణించిన నేపథ్యంలో సోమవారం ఎమ్మార్పీఎస్‌, ఎంఎస్‌పీ నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన భార్య, కుమారులకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ సారథ్యంలో మాదిగ రిజర్వేషన్‌ కోసం శ్యామ్‌బాబు మాదిగ విశేష కృషి చేశారన్నారు. శ్యామ్‌బాబు వంటి నాయకుడిని కోల్పోవడం ఎమ్మార్పీఎస్‌తో పాటు, మాదిగ సామాజిక వర్గానికి తీరని లోటన్నారు. ఈ నెల 19న కాకినాడలో శ్యామ్‌బాబు సంస్మరణ సభ జరుగుతుందని, ఎమ్మార్పీఎస్‌ అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ వస్తారన్నారు. సభకు ముందుగా కాకినాడలో భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్‌ నాయకులు అనంత వరపు రాజు, పలివెల నవీన్‌, దూలపల్లి వెంకటరమణ, జిత్తుక బాబూరావు, పలివెల నాగరాజు, దేవారపు సురేష్‌, నవరపు భైరవమూర్తి, వీధి చిరంజీవి, వీధి వెంకటేశ్వరరావు, ఉందుర్తి విజయకిషోర్‌ బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



గంగమ్మ తల్లికి భక్తులు నిర్వహిస్తున్న పూజలు

కరప: పెద్దాపురప్పాడు గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతర రెండో రోజు సోమవారం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మూడేళ్లకు ఓసారి జరిగే ఈ జాతర (గొల్లల సంబరం) మూడు రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు తెలిపారు. గోవ తాళ్లనే గ్రామ దేవత గంగమ్మగా కొలవడం పెద్దాపురప్పాడు గ్రామస్తులకు ఆచారంగా వస్తోంది. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన యాదవులు బుట్టలోని గోవ తాళ్లను కిందకు దించి, ఆలయ ప్రాంగణంలో ఒకచోట నిలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. గొల్లపల్లి వంశీకుల ఆధ్వర్యంలో జాతర మహోత్సవం జరుగుతోంది. గ్రామస్తులు తమ బంధువులను ఇంటి ఆడపడచులను, స్నేహితులను పిలిచి మూడు రోజులూ జాతరను తిలకిస్తారు. గ్రామానికి వచ్చిన యాదవులు తప్పెటగుళ్లతో నృత్యాలు, భక్తి పాటలు ఆలపించారు. గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. గంగమ్మ తల్లిని దర్శించుకుని, జాతరను తిలకించారు.

నర్సుల సేవలు నిరుపమానం



నర్సులను సత్కరిస్తున్న క్లబ్‌ సభ్యులు



ఫ్లారెన్స్‌ నైటింగేల్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్‌ విఠల్‌, నాయకులు

బాలాజీచెరువు: చిత్తశుద్ధి, కరుణ, సానుభూతి, మానవత్వం, అంకితభావాలు కలిపితేనే నర్సులని, ఈ వృత్తిని ఎంచుకోవడం అభినందనీయమని అలయన్స్‌ క్లబ్‌, కాకినాడ శరవణ్‌ క్లబ్‌ అధ్యక్షులు యాళ్ల రత్నారావు అన్నారు. ఫ్లోరెన్స్‌ నైటింగేల్‌ జయంతి సందర్భంగా సోమవారం జేఎన్‌టీయూకే కళాశాల డిస్పెన్సరీలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరిగింది. దేశ రక్షణలో సైనికులు ఎలా ఉంటారో.. అలాగే ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో నర్సులు సేవలందిస్తారని, వీరి సేవలు అనితర సాధ్యమని కొనియాడారు. మనిషి ఆరోగ్యాన్ని సంరక్షించి, వారి జీవిత కాలం పెంచడం ద్వారా నర్సులు సంపదను సృష్టిస్తారన్నారు. సేవాభావంతో పనిచేస్తేనే ఆ వృత్తికి న్యాయం చేయగలరని చెప్పారు. వైద్యరంగంలో పనిచేస్తున్న వారు సైనికులకన్నా తక్కువేమీ కాదన్నారు. అనంతరం డిస్పెన్సరీ సీనియర్‌ నర్సులు బి.శిరోమణి, వసుంధర వాసు, పి.ప్రణతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్‌ డీవీపీ మాజీ గవర్నర్‌ మునిరెడ్డి, క్లబ్‌ ఎక్స్‌టెన్షన్‌ చైర్మన్‌ దిలీప్‌కుమార్‌, టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నర్సుల సేవలు మరువలేనివి

బోట్‌క్లబ్‌: సమాజంలో నర్సులు అందిస్తున్న సేవలు మరువలేనివని బీజేపీ సౌత్‌ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్‌ అన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా స్థానిక 29వ డివిజన్‌ సచివాలయంలో ఏఎన్‌ఎం విజయకుమారిని సత్కరించారు. 15 ఏళ్లుగా ఆమె అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. కరోనా సమయంలోను ప్రాణాలకు తెగించి సేవలందించారన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో...

కాకినాడ క్రైం: కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో సోమవారం అంతర్జాతీయ నర్సింగ్‌ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా నర్సింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈఅండ్‌టీ సెమినార్‌ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎం.పాండురంగ విఠల్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫ్లారెన్స్‌ నైటింగేల్‌ విగ్రహానికి నివాళులర్పించారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో నర్సుల చొరవను కొనియాడారు. రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌ సూపరింటెండెంట్లు సహా, సంఘ నాయకులు, స్టాఫ్‌ నర్సులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఈఓగా పదోన్నతి

బోట్‌క్లబ్‌: నగరంలోని మెయిన్‌ రోడ్డులో ఉన్న దేవదాయ శాఖకు చెందిన ముత్తా రామన్న సత్రంలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వైవీవీ సత్యనారాయణకు గ్రేడ్‌–3 ఈవోగా పదోన్నతి లభించింది. మూడు దశాబ్దాలుగా కడియం మండలం మురమండ సోమేశ్వరస్వామి దేవస్థానంలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేశారు. 2022లో స్థానిక మెయిన్‌ రోడ్డులోని ముత్తా రామన్న సత్రానికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఆయనకు ఈఓగా పదోన్నతి లభించింది. ఇంకా సత్యనారాయణకు గ్రేడ్‌–3 దేవాలయాన్ని కేటాయించాల్సి ఉంది.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలు

కాకినాడ లీగల్‌: చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో నిందితుడికి 18 నెలల జైలు, రూ.40 లక్షల పరిహారం చెల్లించాలంటూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ డి.శ్రీదేవి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ కథనం ప్రకారం, కాకినాడకు చెందిన మన్యాల వీరవెంకటరమణ వద్ద నగరానికి చెందిన సేరు చిన్న 2019లో రూ.26 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు చిన్న 2024లో రూ.40 లక్షల చెక్కు ఇచ్చారు. చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్‌ కావడంతో వీరవెంకటరమణ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు, పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.